# దాస్యం

సరోజనమ్మ ఏడుస్తోంది...

చెమ్మగిల్లిన గుండె... చెదిరిన కనుపాపల్ని తడిచేస్తోంది. మనసు పొరల్ని తడిమేస్తోంది. ఓడిన జీవితాల్లా చెక్కిలి జారుతోన్న ప్రతి అశ్రుకణం అణువణువునీ తడిపేస్తోంది.

ఆమె భర్త కాశీనాథం మరణించాడు.

ఆర్తిగా ఆమె కనుదోయి ఆర్ద్రతా భరితమవుతున్నా... ఎదని మెలిపెడుతోన్న చింత మాత్రం... చెంతలేని కొడుకు గురించే! శ్వాస విడిచేముందు తనయుడిని కడచూపునకు నోచుకోని తండ్రి పడిన తపన గురించే!

ఆమె తమ్ముడు గోవర్ధన్ అమెరికాలో ఉంటున్న మేనల్లుడు సంజయ్‌కీ విషయం చేరవేశాడు.

ఫోన్‌లోనే ఏడుపందుకున్న సంజయ్... రెండు గంటల అనంతరం తిరిగి మేనమామకి కబురందించాడు. రాత్రి ఫ్లైట్‌కి భార్యాకొడుకుతో సహా బయల్దేరుతున్నానని... ఎల్లుండి తెల్లవారుజామున మూడు వరకు హైద్రాబాద్‌లో ఉంటానని.

అక్కడినుండి జగిత్యాలకి వచ్చేసరికి మరో అయిదారు గుంటలు పడుతుంది. అప్పటివరకు శవం భద్రంగా ఉండడానికి జాగ్రత్తలు తీసుకున్నారు.

సంజయ్ వచ్చాక స్వయంగా దహన సంస్కారాలు జరిపాడు.

తల్లిని సముదాయించాడు. తొమ్మిది నెలల తన కొడుకులో తండ్రి పోలికల్ని చూపెడుతూ తల్లి మనసు మళ్లించే ప్రయత్నం చేశాడు. మనవడితో కులాసాగా ఆడుకుందామె. బామ్మ దగ్గర బాగా మాలిమి అయ్యాడు కుర్రాడు.

దశదిన కర్మ కూడా పూర్తయ్యింది. చుట్టాలు వెళ్లిపోయారు. ఎప్పట్లా ఇల్లు బోసిపోయింది.

తల్లిని తమతోపాటుగా బంధువుల చెంతకు... ఫ్రెండ్స్ ఇళ్లకు... అలా ఊర్లన్నీ తిప్పాడు... ఆమె వద్దని వారించినా.

పెళ్ళయ్యాక వెళ్లిన సంజయ్ నాలుగేండ్ల వరకూ ఇండియా రాలేదు. కానిపుడు కురిపిస్తున్న ఆప్యాయతకు సరోజనమ్మ మనసు కుదుటపడింది. కొంత ఊరట చెందింది.

హాల్లో ఒంటరిగా దిగాలుగా కూర్చొని ఉన్న తల్లిని చేరాడు సంజయ్.

పక్కనే కూర్చుంటూ "అమ్మా..." అని ప్రేమగా పలికాడు.

నిర్లిప్తంగా కొడుకు వంక చూసిందామె.

"వచ్చి ఇరవై రోజులయ్యింది. మరో పది రోజుల్లో తిరుగు ప్రయాణం..."

అతడి మాట పూర్తవకుండానే అంది సరోజనమ్మ.

"ఇరవై క్షణాల్లా గడిచాయిరా. అయినా అప్పుడే వెళ్లిపోతారా?" అలా అడుగుతున్నపుడు ఆమె కనుకొనలు ఆందోళనగా ముడుచుకున్నాయి.

"సడెన్‌గా రావాల్సి వచ్చింది కదమ్మా!" అనునయంగా బదులిచ్చాడు.

"మరో నెలయినా ఉండిపోకూడదూ?" ప్రేమతో నిండాయామె పలుకులు.

"అస్సలు ఉండిపోము..." నవ్వుతూ "నిన్ను కూడా వెంట తీసుకుపోతాం" అన్నాడు.

ఆశ్చర్యమో... అపనమ్మకమో...

"నన్నా?" టపటపలాడాయి ఆమె కనురెప్పలు.

"ఆయన చెప్పింది నిజమేనత్తయ్యా! మీరు కూడా మాతో పాటే వచ్చేస్తున్నారు." చిన్నాడిని నిద్రపుచ్చి వస్తూ చెప్పింది మాధవి.

"నేనెందుకులే" కలవరపాటుతో ప్రశ్నించిందామె.

"నాన్నలేని నువ్విక్కడెందుకు?" ప్రశ్నకు ప్రశ్న బదులిచ్చాడు.

"ఆల్రెడీ మీ అబ్బాయి టికెట్స్ కూడా బుక్ చేశారు. మొన్న మిమ్మల్ని తీసుకెళ్ళింది స్టాంపింగ్ కొరకే. ఆవిషయం మీకు తెలీదు. మరో మాట లేదు. మీరు మాతోపాటు వస్తున్నారు" అభిమానంగా అత్తమీద ఆర్డర్ జారీ చేసిందామె.

"ఒక్కదానివెలా ఉండగలవమ్మా?" తిరిగి సంజయ్ అడిగాడు.

నిజమే!

ఒంటరిగా...

ఆయన జ్ఞాపకాల్తో... క్షణక్షణం నరకమై... పిచ్చెక్కిపోదూ?

సరోజనమ్మ మౌనంగా ఉండిపోయింది.

తల్లి కళ్ళలోని మెరుపే సమ్మతంగా భావించిన సంజయ్ టాపిక్ మార్చాడు.

"అమ్మా! మనం వెళ్లేలోగా ఒక పని పూర్తి చేసుకోవాలి" అన్నాడు మెల్లిగా.

"ఇంకేం పని ఉందిరా?" ఆశ్చర్యం వ్యక్తం చేసిందామె.

వెంటనే అతని పెదాలు విచ్చుకోలేదు.

"నాన్న కట్టిన ఈ ఇల్లు... చుట్టూ అల్లుకున్న తోట... వీటిని అమ్మేపనా?" కొడుకు అంతర్యం పసిగట్టినదానిలా తనే అడిగింది.

"ఛ! ఛ! ఇల్లమ్మితే డబ్బెంతొస్తుంది? మహా అయితే... అమెరికాలో మా ఇద్దరి నెల సాలరీ అంతేమో! ఆ ఆలోచనేం లేదులే" సంజయ్ అన్నాడు వెంటనే.

"మరి...?" ఆమె కనుబొమ్మలు ముడిపడ్డాయి.

అతనేమన్లేదు.

మాధవి కలుగజేసుకుంది.

"మీకు చెప్పడానికి సంశయిస్తున్నారాయన. చిన్నాడికి తొమ్మిది నెలలొచ్చాయి కదత్తయ్యా! వాడికి కొండగట్టు అంజన్న దగ్గర పుట్టు వెంట్రుకలు తీద్దామని ఆయన ఆలోచన..."

"ఇప్పుడా?" నివ్వెరపోయిందామె.

"మళ్ళీ ఇండియా కెప్పుడొస్తామో తెలీదు. ఎలాగూ వచ్చాం కదా! కుదిరిందని..." సంజయ్ కూడా మాట కలిపాడు.

"నాన్నగారి సంవత్సరీకం కాకుండా సంవత్సరంలోగా ఇలాంటి శుభకార్యాలెలా జరుపుతారు?" తత్తరపాటుతో అడిగింది సరోజనమ్మ.

"ఆ సమయానికి అమెరికాలో ఉంటాం కదమ్మా?" నచ్చచెప్పాడు.

"చిన్నతనంలో తన వెంట్రుకలిచ్చిన మన కులదైవం దగ్గరే చిన్నాడి పుట్టు వెంట్రుకలివ్వాలని ఆయన సెంటిమెంటత్తయ్యా!"

కోడలి మాటల్ని వ్యతిరేకిస్తూ "అయితే మటుకు ఇదేం విడ్డూరం... జనం నవ్విపోరూ?" అంది.

కొడుకు కోడలు వ్యవహారం సుతారమూ నచ్చలేదామెకు.

"అందరికీ తెలియడానికి పందిరేసి ఫంక్షనేం చెయ్యట్లేదుగా?" విసురుగా జవాబిచ్చాడు సంజయ్.

"అనవసరంగా టెన్షన్ పడతారేం? మీరాగండి..." భర్తని వారిస్తూ -

"ఎవ్వరికీ చెప్పకుండా గోప్యంగానే ఈ కార్యం కానిద్దాం అత్తయ్యా! పెద్దవారు... పరిస్థితిని మీ అబ్బాయి మనోస్థితిని అర్థం చేసుకోండి" సరోజనమ్మని కన్విన్స్ చేసే ప్రయత్నం చేసింది మాధవి.

తను ఔనన్నా కాదన్నా పిల్లలీ కార్యం కానిచ్చేటట్టున్నారని సరోజనమ్మకు అర్థమైంది వాళ్ల మాట తీరు తరహా చూస్తుంటే.

కనీసం తన భర్త మనవడ్ని చూడకపోయినా... ఆయన నమ్మే దైవం చెంతనైనా... చిన్నాడి వెంట్రుకలు తీయిస్తామని కొడుకూ కోడలు పట్టుబట్టడం దైవికంగా భావించింది.

అందుకే కాస్త మెత్తబడింది. పెద్దరికం నిలుపుకోవాలని భావించింది.

"గుళ్ళోకి వెళ్ళకూడదు కదరా..." అంది తడబడుతున్న స్వరంతో.

తమ మాట మన్నించి ఆమె తగ్గినందుకు దంపతులిద్దరూ రిలీఫయ్యారు.

"అలాగేనమ్మా! నీ మాట ప్రకారమే కానిద్దాం. గర్భగుడిలోకి వెళ్ళే ప్రసక్తి లేదు. గుడి బయట దేవాలయ ప్రాంగణం వరకే తంతు జరిపిద్దాం. దైవదర్శనం కూడా వద్దు. సరేనా?" అన్నాడు సంజయ్.

"నేను మటుకు రాను. నన్నిబ్బంది పెట్టకండి. మీరిద్దరూ వెళ్లిరండి" అంది పొడిగ్గా.

తలలూపారిద్దరు.

"మాధవి పుట్టింటి వాళ్ళకూ్కడా ఈ విషయం పొక్కకూడదు. వాళ్ళకంటే తెలీదు పిల్లలు. పెద్దావిడకేమయ్యిందని నన్ను పొడుస్తారు" చెప్పిందిద్దరికి.

ఒప్పుకుందంతే చాలనుకున్నారిద్దరు.

"పుట్టు వెంట్రుకలు మేనమామ కత్తిరించే ఆచారం ఉందనా? అదేం లేదు. మా తమ్ముడ్ని పిలిపించను. మీరేం భయం పెట్టుకోకండి" భరోసా ఇచ్చింది మాధవి.

అమెరికా వెళితే మాత్రం? ఆచార వ్యవహారాలు బొత్తిగా మంటగలిపితే ఎలా? కన్రెప్పల తడి తోడవుతుంటే మౌనంగా తన గదిలోకి వెళ్లిపోయింది సరోజనమ్మ.

✤ ✤ ✤

పుట్టు వెంట్రుకల తతంగం పూర్తయ్యాక, మర్నాడు...

"హమ్మయ్యా! ఇండియా వచ్చిన పనైపోయింది." భర్తతో అంది మాధవి గట్టిగా ఊపిరి పీలుస్తూ.

"సంబరం సరే. మీ తమ్ముడితో చెప్పావా? వాడొచ్చి చిన్నాడి పుట్టు వెంట్రుకలు కత్తిరించిన విషయం మా అమ్మకి తెలియనివ్వకూడదని..." అడిగాడు సంజయ్.

"అబ్బా! మీకన్నీ అనుమానాలే... చెప్పానులెండి. వాడు మా ఇంట్లో వాళ్ళతో కూడా నోరు జారడు" అంటూ సర్ది చెప్పింది మాధవి.

"ఓకే డియర్! ఇట్సోకే!" అంటూ భార్య బుగ్గమీద చిటికేసాడు సరదాగా.

"మీరు మాత్రం పుట్టు వెంట్రుకల కోసమే మనం ఇండియా ట్రిప్ వేసుకున్నామని మీ మేనమామతో గాని, ఫ్రెండ్స్ దగ్గరగాని నోరు జారకండి. బంధువులు చెవులు కొరుక్కుంటారు" గుర్తుచేసింది భర్తకు.

"ఆల్రెడీ ఎప్పుడో టికెట్స్ రిజర్వ్ చేసుకున్నామని. ఇదే సమయానికి నాన్న కూడా చనిపోవడం కాకతాళీయంగా జరగడంతో... ఆయన చనిపోయారనే టికెట్స్ బుక్ చేసుకుని వచ్చామని అందరికీ చెప్పాం. అమ్మ కూడా అలా అనే నమ్ముతోందిగా!" అన్నాడు.

ఆకాశం ఫెళ్ళున విరిగి...

రాలిపడిన మేఘ శకలాలు గుండెని ఛిద్రం చేస్తోంటే... అడుగులు బరువై... నోట మాట కరువై... సరోజనమ్మ వడివడిగా కదిలిందక్కడి నుండి.

వినడం సబబు కాదని తెలిసీ ఆగింది ఓరగా వేసి వున్న వాళ్ళ గది తలుపుల దగ్గర. వినకూడని విషయాలే చెవిన పడటంతో ఆమె మనసు చెదిరింది.

కొడుకు కోడలు వేసుకున్న రంగుల ముసుగు తొలగి వాళ్ళ అసలు అంతరంగం బహిర్గతమవడంతో... ముసురుకొన్న ఆలోచన్ల నడుమ ఆ రాత్రి నిద్రపోలేదు.

తన భర్త తరఫున గుడిపేట గ్రామంలో ఉన్న బంధువులను కలవడానికి వెళ్లొచ్చిన సరోజనమ్మ రాక వాళ్ళకి తెలీదు.

తమ మధ్య దాగున్న రహస్యాల ముడులు ఒక్కొక్కటిగా విప్పుకుంటూ కబుర్లలో మునిగిపోయారు.

✣ ✣ ✣

అమెరికా ప్రయాణం దగ్గర పడింది.

తెల్లవారితే... ఉదయమే ఫ్లయిట్. రాత్రి తొమ్మిదింటికి హైద్రాబాద్ బయల్దేరాలి.

వీధిలోని పరిచయస్థులందర్నీ కలిసింది. అమెరికా వెళ్తున్నానని చెప్పి ఇంటికి తిరిగొచ్చింది సరోజనమ్మ. ఆ సమయానికి...

"మా అమ్మానాన్నల్ని పలకరించమంటేనే చిరాకు పడేదానివి. బలవంతపెడితే ఎప్పుడో ఒకసారి మొక్కుబడిగా యోగక్షేమాలు అడిగేదానివి. అలాంటిది మా నాన్న మరణంతో సడెన్‌గా నీలో ఇంత మార్పొచ్చిందేమిటి?" భార్యని దగ్గరగా తీసుకుంటూ లాలనగా అడిగాడు సంజయ్.

దూరంగా జరుగుతూ "నాలో మార్పేంటబ్బా?" పెదాలపై చూపుడు వేలాన్చింది ఆశ్చర్యాన్ని అభినయిస్తూ.

నవ్వాడు.

"అంత సీరియస్ ఫోజేం అక్కర్లేదుగా" అంటూ.

"అలాగైతే చెప్పండి. చెప్పండి. ఏంటో అది?" అంది సరదాగా భర్త చేతులు పట్టి కుదుపుతూ.

"మా అమ్మనేంటి? మనతో తీసుకురమ్మని... నాతో హఠాత్తుగా సీన్ మార్పిం చేశావ్?" అనడిగాడు.

"ఓ! అదా? ఇంకా తమరినుండీ ప్రశ్న రాలేదేంటాని అనుకుంటున్నాను. చీమ చిటుక్కుమన్నా... విషయం తెలియబరచకపోతే తమరికా రాత్రి నిద్రపట్టదుగా?" వ్యంగ్యంగా భర్తని దెప్పిపొడిచింది.

"డియర్... సోది ఆపుతావా? ఈ మర్మమేంటో ముందు సెలవిస్తావా?" అంటూ రెండు చేతులెత్తి జోడించాడు.

"తప్పదు కదా! లేకపోతే తిప్పలు నాకేగా. చిన్నాడు డెలివరీ అయినప్పటి నుండి ఆఫీసు మానేసానా? కనీసం ఇప్పటికైనా జాయిన్ అవుదామని..."

"మరి చిన్నోడి విషయం?" ఆగి "కేర్ సెంటర్‌లో వేద్దామనా?" అనడిగాడు ఆశ్చర్యంగా.

"ఏవండోయ్ శ్రీవారూ! స్పృహలో ఉండే మాట్లాడుతున్నారా? ఆ రోజు నేనీ మాట అన్నపుడు విన్నారా? ఆ కేర్ సెంటర్ వాళ్ళకిచ్చే హై ఎమౌంట్ కంటే నేను జాబ్ మానేయడం బెటరన్నారు"

"య్యా! నిజమేననుకో"

"అందుకే ఇలా డిసైడయ్యా. మీ అమ్మని వెంట తీస్కెళితే వాడి ఆలనా పాలనా చూసుకుంటుంది. వండీ వార్చుతుంది. పోయేది మూడు పూటల తిండేగా?"

"అదా నీ థాట్?"

"దాసిని పెట్టుకున్నా ఇంతకంటే నమ్మకంగానైతే ఉండదుగా?"

"...."

"ఒక్కతే ఉంటోంది పాపం ఇండియాలో అని జాలిపడి మనతో వెంట పెట్టుకొని రమ్మంటున్నాననుకున్నారా?" ఆమె స్వరం తీరు మారింది.

"అమ్మ అలాగే అనుకుంటోంది. కొడుకూ కోడలుకి తనమీదెంత ప్రేమోనని ఇరుగూ పొరుగుకి చెప్పుకుంటూ తెగ మురిసిపోతోంది"

"ఆమెని ఆ భ్రమలోనే ఉండనివ్వండి. మీలో మాత్రం ప్రేమ పొంగుకు రానీయకండి" వెటకారంగా అంది.

"మరలాంటప్పుడు ఇక్కడి ఇల్లూ భూమి అన్నీ అమ్మేసేవాడ్నిగా! ఓ పనైపోయేది" అన్నాడు.

"అంటే.. మీ అమ్మనక్కడే ఎల్లకాలం ఉంచేసుకుందామనా మీ ఉద్దేశ్యం?" కాస్త తీవ్రమయ్యిందామె గొంతు.

భార్య ఇలా నిక్కచ్చిగా ప్రశ్నించేసరికి వెంటనే ఏం మాట్లాడాలో గొంతు పెగల్లేదతనికి.

"చిన్నాడిని స్కూల్లో జాయిన్ చేయించే వరకే అమెరికాలో ఉంటుంది. ఆ తర్వాత రిటర్న్ పంపిచేయడమేగా? మరి వచ్చాక ఎక్కడుంటుంది?" అంటూ కయ్‌మని లేచింది.

తోక ముడుచుకున్నాడతను.

వాళ్ళ నిజ స్వరూపాలకు...

వింటున్న ఆ అమాయకపు తల్లి హృదయం బద్దలైంది. మనోఫలకం శిథిల తుల్యమైంది.

కొడుకు ఏం చెబుతాడోనని చెవులు రిక్కించింది.

'ఒక్కత్తినే ఇండియాలో ఒంటరిగా ఎలా ఉండనిస్తా? అమ్మకి మనం తప్ప ఎవరున్నారని?' అంటాడని ఆశించింది.

ఆ తల్లి ఆశ అడియాస అయింది.

"అమ్మే ఆలోచన మానుకుంటాను" అని మాత్రం అన్నాడు.

కొడుకు బుద్ధావతారమెత్తాడు.

భరింపలేక తటాలున వెనుదిరిగింది. తలుపులు తెరచి లోనికి అడుగు పెట్టకుండానే... ఇంటి దగ్గర్లో ఉన్న పార్క్ చేరి సిమెంట్ బల్లపై కూర్చుండిపోయింది శూన్యంగా.

అప్పటికే చీకటిపడింది. నియాన్ లైట్ల వెలుతురు పార్క్‌లోని పచ్చని చెట్లకి కాంతిని పొదుగుతోంది.

ఆలోచనలు... ఆలోచనలు.. సుడిగాలిలా చుట్టుముట్టాయి. ఈదురుగాలులలా

వణికింపచేశాయి.

వీళ్ళకోసమే... కేవలం వీళ్ళ పనుల కోసమే... ఇండియాకి వచ్చారన్నమాట. తండ్రి చనిపోయాడన్న దుఃఖంతో కాదు. తల్లి మీద సానుభూతితో కాదు. తల్లి ఆలనా పాలనా కోసం అసలే కాదు.

వీళ్ళ కోసమే. కేవలం వీళ్ళ అవసరాల కోసమే తనని అమెరికా తీసుకుపోతున్నారన్నమాట. కన్నతల్లి వార్ధక్యానికి ఆసరాగా నిలబడాలని కాదు. ఆలంబనై అల్లుకుపోదామని అసలే కాదు.

వాళ్ళకి సమయానికి నమ్మకమైన ఒక దాసి కావాలి. దాని దాస్యం కావాలి. అంతే! నిలువెల్లా ఎంత స్వార్థం?

**"చదువు'కొన్నాడు'గా! మనం రెక్కలు ముక్కలు చేసుకొని... తిండీ తిప్పలు మానేసి... వాడితో 'కొనిపించాం'గా! ఇప్పుడమ్ముకొంటున్నాడు. వడ్డీతో రాబట్టుకోవాలి. వాడికి లెక్కలు నేర్పించాం కదా సరూ! సాఫ్ట్‌వేర్ ఇంజనీరై లెక్క తప్పడంలేదు మరి"** చెవిలో గుసగుసలాడినట్లు భర్త స్వరం వినిపించేసరికి ఉలిక్కిపడింది సరోజనమ్మ.

చుట్టూ చూసింది. ఎవరుంటారక్కడ? తనొక్కర్తే.

నిజమే మరి. బతికున్న రోజున ఆ మహానుభావుడన్న మాటలు అక్షరసత్యం.

వీళ్ళకి డాలరు యావ తప్ప... గుండె ఆప్యాయత పలికించదు... మనసు అనురాగం చిలికించదు...

మళ్ళీ పాత జ్ఞాపకాలు పక్షుల్లా మనసు కొమ్మకి వాలాయి.

"ఎందుకండీ! వీడికి మన మీద వీసమెత్తు ప్రేమ లేదు? ప్రతిదీ స్వార్థంతో ఆలోచిస్తాడేం? మనకి వీడొక్కడేగా! ఏం తక్కువ చేసామని?" సరోజనమ్మ బేలగా ప్రశ్నించినపుడు.

కాశీనాథం వేదాంతిలా నవ్వాడు.

"మనలోని స్వార్థమే వాడికి అబ్బింది. మన రక్తం... మన పంచప్రాణాలు.. మన కన్నపేగు... అని ముద్దాడి మన రక్తమాంసాల్ని ధారపోసాంగా!

**ఏనాడైనా పరుల గురించి... కనీసం పక్కవారి గురించి... వీసమెత్తైనా ఆలోచించామా?**

వాడిపుడదేకదా చేస్తున్నాడు. వాడి గురించి వాడాలోచిస్తున్నాడు. తప్పేం కాదుగా?

అయినా జీవితమంటే... జీవిత పరమార్థమంటే... ఇది కాదేమో సరూ!

**మానవ జీవనానికో సార్థకత ఉండాలి. సమాజం గురించి ఆవగింజంతయినా ఆలోచించాలి. కొంతయినా సేవాదృక్పథం అలవడాలి.**

ఒక్కసారి... ఒకే ఒక్కసారి లోతుగా ఆలోచించు!

నిజ జీవిత సత్యం నీకే బోధపడుతుంది."

కాశీనాథం మంచం పట్టినప్పుడు... తండ్రిని చూడ్డానికి రమ్మంటే... వీలుకాదని చెప్పాడు సంజయ్. ఆ సందర్భంలో ఆయన వెలిబుచ్చిన ఆవేదనది.

ఆనాటి భర్త పలుకులు కనువిప్పు కలిగించాయి. కర్తవ్యాన్ని ప్రేరేపించాయి.

చిప్పిల్లిన కంటి నీరొత్తుకుంది చీరకొంగుతో. ఒక నిర్ణయానికి వచ్చినదానిలా దిగ్గన లేచి ఇంటివైపు మళ్ళింది.

ఇండియా వదిలి రానని సరోజనమ్మ మొండికేయడంతో అమెరికా వెళ్ళి పోయారిద్దరు.

✤ ✤ ✤

సరోజనమ్మ కుటుంబ మమకారాన్ని వదిలిపెట్టింది.

తనతోపాటు మరో ఇద్దర్ని కూడగట్టుకుంది. ఇంటిచుట్టూ ఉన్న తోటలో కూరగాయలు వేసింది. పూలమొక్కలు నాటింది. వాటిని అమ్మగా వచ్చిన సొమ్ముని... తనకొచ్చే పెన్షన్ డబ్బుల్ని... సమాజ సేవకోసం వినియోగించదలచింది. తన ఇంటినొక స్వచ్ఛంద సేవా కేంద్రంగా మలిచింది.

'ఇన్నాళ్ళూ కుటుంబానికి తల్లిగా సేవలందించాను. ఇపుడీ విశ్వమంత కుటుంబానికి సైతం ఓ తల్లిలానే దాస్యం చేస్తాను.

ఎందుకంటే -

అమ్మ ఎవరికైనా అమ్మే కావాలి!' అనుకుంది.

సరోజనమ్మ భర్త ఆలోచనలకి, ఆశయాలకి అనుగుణంగా -

ఆ ఇల్లు...

ఆహ్లాదకరమైన ఆ చోటు...

ఇపుడు ఆర్తులకి ఆనందనిలయం.

(03.05.2008)

**ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ**

✻